క్లుప్తంగా

చిన్నారి మోహన మృతి



తల్లిదండ్రులతో చిన్నారి మోహన (ఫైల్)

కడియం: అరుదైన స్పైనల్ మస్క్యులర్ ఆట్రోఫీ (ఎస్ఎంఏ) టైప్- 1తో బాధపడుతున్న కడియం మండలం మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్యనగర్‌కు చెందిన మోహన మృతి చెందింది. ఈ చిన్నారి వ్యాధి నివారించేందుకు దాదాపు రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్లు అవసరమని వైద్యులు తేల్చడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు, దాతల సహకారాన్ని కూడా మీడియా ద్వారా చిన్నారి తల్లిదండ్రులు డొక్కా ఈశ్వర్, శ్రావణిలు అర్థించారు. ఈ ప్రయత్నాల్లో ఉండగా మోహన పరిస్థితి విషమించి ఆమె కన్నుమూయడం అందరినీ కలచివేసింది.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



వేమగిరిలో షాపు యజమానులకు నోటీసులిస్తున్న డీపీఓ నాగలత

కడియం: గ్రామాల్లో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని డీఎల్‌పీఓ ఎం.నాగలత హెచ్చరించారు. వేమగిరి పంచాయతీ పరిధిలో బుధవారం పలు షాపులను ఆమె తనిఖీ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. యజమానులకు నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగించడం గుర్తిస్తే, దానిని తక్షణం అడ్డుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ నీలం శ్రీనివాసరావు, వేమగిరి కార్యదర్శి రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ నిర్వహణ అభినందనీయం

ప్రకాశంనగర్: 40 ఏళ్ల విభాగంలో మాస్టర్స్ కప్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో భారత్ రైసింగ్ ఫౌండేషన్, జై కిసాన్ ఆధ్వర్యంలో రెండో రోజు మ్యాచ్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జైకిషన్, మిధున్‌వర్మ, మూర్తిచౌదరి, చల్లా బాలమురళీ, రామకృష్ణ, చైతన్య పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో టైమ్ రీల్ ద్వారా మధ్యవర్తిత్వంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సభ్యులు, మధ్యవర్తిత్వంపై ట్రైనింగ్ తీసుకున్న న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా పోరాడతాం..



వెంకన్నబాబు

రాజమహేంద్రవరం సిటీ: హ్యూమన్ రైట్స్ అసోసియేషన్, అవినీతి నిరోధక సంస్థ జిల్లా చైర్మన్‌గా రాజమహేంద్రవరం నగరానికి చెందిన తుపాకుల వెంకన్నబాబును నియమిస్తూ హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కులకు భంగం కలగకుండా చూస్తానన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బయ్యపునేని వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ రావులపల్లి తిరుపతయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకన్నబాబును పలువురు అభినందించారు.

హామీలన్నీ అమలు

కడియం: తాము అధికారంలోకి వచ్చాక హామీలన్నీ అమలు చేస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని కడియపులంక, వెంకాయమ్మపేట గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకాయమ్మపేట అంగన్‌వాడీ కేంద్రంలో పరికరాలు, పుస్తకాలను పంపిణీ చేశారు.

సెగపాట్లు..

- పెరుగుతున్న భానుడి భగభగలు
- వేడికి అల్లాడుతున్న ప్రజలు
- కరెంట్ కోతలతో మరింత ఉక్కిరిబిక్కిరి

సీటీఆర్ఐ: భానుడు భగభగలు సృష్టిస్తున్నాడు.. రోజురోజుకూ నిప్పులు కురిపిస్తున్నాడు.. జూలై నెలలోనూ 'సెగ'పాట్లు తప్పక సగటు జీవి అల్లాడుతున్నాడు. సాధారణంగా అత్యధిక వర్షపాతం నమోదు అయ్యే ప్రస్తుత రోజుల్లోనూ మంటలు పుట్టిస్తున్నాడు. ప్రస్తుతం గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. కానీ విచిత్రంగా భానుడు ఇంకా వేసవిని తలపించేలా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ నెల మొదటి వారం నుంచే వానలు కురవడంతో వాతావరణం పూర్తిగా మారిపోతుంది. మే నెలలో ఉష్ణోగ్రతలు ఎంత ఉన్నాయో అంతే ఇప్పుడు నమోదు కావడం విశేషం. గత వారం రోజులుగా రాజమహేంద్రవరం నగరంలో 38 డిగ్రీలు నుంచి 39 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనితో పాటు అధికంగా ఉక్కబోత తోడవ్వడంతో నానా ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు చెట్ల నరికివేత సాకుగా చూపించి కరెంట్ కోతలు విధించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంత వేడి జూలై నెలలో ఎప్పుడూ చూడలేదని పెద్దలు అంటున్నారు.

ముందుకొచ్చి.. వెనక్కి తగ్గి

రుతువులు వచ్చేస్తున్నాయని వాతావరణ శాఖ చెప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అలానే ఈ నెల మొదటి వారం నుంచి వర్షం పడడంతో జనం ఆనందించారు. ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా మారిపోతున్నాయి. నగరంలో విచిత్ర వాతావరణం ఏర్పడుతుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వర్షాలు పడటం, జూలై నెలలో ఎండలు కాయడంతో ఏ సీజన్‌లో ఏం జరుగుతుందో తెలియడం లేదని జనం అంటున్నారు.

చెట్ల నరికివేతతో...

నగరం అంతా పచ్చని చెట్లతో కళకళలాడుతూ ఉండేది. అయితే నగర అభివృద్ధి అంటూ, విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని చెప్పి నగర పాలక సిబ్బంది చెట్లను యథేచ్ఛగా నరికేయడంతో పర్యావరణ సమతుల్యత లోపిస్తుంది. దీనివల్ల ఎండ తీవ్రత పెరుగుతోంది. ఇదిలా ఉంటే ఎండ దంచేడంతో బాటసారులు, వాహనచోదకులు పని మీద బయటకు వస్తే శీతల పానీయాలపై ఆధారపడుతున్నారు. కొబ్బరి బొండాలకు గిరాకీ పెరడగంతో ఒక కాయ రూ.30 వరకూ అమ్ముతున్నారు. చెరుకు రసం, బొప్పాయి, సోడాలు, నిమ్మరసాలు, లస్సీ, ఫ్రూట్‌జ్యూస్‌లే కాకుండా కూల్‌డ్రింక్స్ కూడా ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. ఇదిలా ఉంటే మధ్యాహ్నం 12 గంటల నుంచే రోడ్లపైకి ఎవరూ రావడం లేదు. ఎంతో ముఖ్యమైన పనిఉంటే తప్ప ఎవరూ బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. ఫలితంగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.



కంబాలచెరువు చిరంజీవి బస్టాండ్ సమీపంలో నిర్మానుష్యంగా రోడ్డు

ఉష్ణోగ్రత పెరుగుతోంది..



వనాలను నాశనం చేయడం, అడవులను తొలగించడం వల్ల నీడ లేక, ఆక్సిజన్ విడుదల తగ్గడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భూమిపై ఎక్కువగా కాంక్రీట్ భవనాలు, రహదారులు పెరగడంతో నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. ఫలితంగా ఎండ తీవ్రత గణనీయంగా పెరుగుతుంది. ఇది మన ఆరోగ్యంపై, పర్యావరణంపై దుష్ప్రభావం చూపుతుంది.

– ఎం.శ్రీదేవి, బోటనీ లెక్చరర్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

కాలుష్యానికి కారణం



భవిష్యత్తులో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. అధిక జనాభా కేంద్రీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల ప్రకృతి వనరుల వినియోగం అధికమవుతుంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. వాహనాల నుంచి వెలువడే పొగ వాతావరణ కాలుష్యానికి కారణమవుతుంది. ఇది వాతావరణ మార్పులకు దారి తీస్తోంది. అందువల్లే ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

– సీహెచ్ ప్రియాంక, జువాలజీ లెక్చరర్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

విష్ణుమూర్తికి పరామర్శ



తాటికొండ విష్ణుమూర్తిని పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, కోలమూరుకు చెందిన తాటికొండ విష్ణుమూర్తిని బుధవారం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. ఇటీవల విష్ణుమూర్తి మాతృమూర్తి అరవాలమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. అరవాలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ముద్దాల అను, షేక్ ఇబ్రహీం, కురుమళ్ల ఆంజనేయులు, పిన్నమరెడ్డి సూర్యచంద్రం తదితరులు ఉన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ సంఘీభావం



జక్కంపూడి రాజాకు సంఘీభావం తెలుపుతున్న క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు

సీటీఆర్ఐ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవరెండ్ విజయసారథి బుధవారం సంఘీభావం తెలిపారు. మూడు రోజులుగా రాజమహేంద్రవరంలోని ఆంధ్రపేపర్ మిల్లు కార్మికుల విషయంలో జరుగుతున్న అన్యాయంపై యాజమాన్యంతో పోరాడుతున్న రాజాకు జిల్లా క్రిస్టియన్ మైనారిటీస్ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. కార్మికుల పక్షాన పోరాటం సాగించడం అభినందనీయమన్నారు. కార్మికులకు న్యాయం జరిగే ఎలాంటి ఆందోళనలకైనా తమ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ కోఆర్డినేటర్ బి.రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో బ్యానర్లు, వాల్ పోస్టర్లు, ఆడియో అండ్ వీడియో ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధం, మహిళా భద్రత (మహిళా సురక్ష) అంశాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. మహిళా ప్రయాణికులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించడమే కాకుండా, మానవ అక్రమ రవాణా నుంచి రక్షించుకునే ముందు జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి అత్యవసర సమయాల్లో హెల్ప్ లైన్ నంబర్లు 139, 1098, 100 ఉపయోగం గురించి వివరించారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ, మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ, బాలల పరిరక్షణ విభాగం, లైన్ డిపార్ట్‌మెంట్స్ సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఎస్ఐ విశ్వనాథ్, ఏఎస్ఐ దాసు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి అనంత ప్రదీప్, ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.క్రాంతిలాల్ తదితరులు పాల్గొన్నారు.



మానవ అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మైనార్టీల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పార్టీ మైనార్టీ సెల్ నాయకులకు సూచించారు. బుధవారం వేణుగోపాలకృష్ణను బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ హబీబుల్లాఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా మైనార్టీ సెల్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న మైనార్టీ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలాగే చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, నాయకులు చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ

మృతుల కుటుంబాలకు ఓదార్పు

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో ఇటీవల పలువురు మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. బుర్రిలంకకు చెందిన కుప్పాల పద్దరాజు, కడియపులంకకు చెందిన ఈలి వెంకాయమ్మల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, నాయకులు కొత్తపల్లి శివాజీ, తిరుమలశెట్టి శ్రీను, గాద రామకృష్ణ, బోడపాటి మూర్తి, ఆలమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ



కడియపులంక పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

కడియం: మండలంలో కడియపులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఆర్‌సీహెచ్, గర్భిణులు, తల్లిదండ్రుల సంరక్షణ, టీబీ పరీక్షలు, ల్యాబ్ సేవలు, మందులు తదితర అంశాలను తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

పెదపూడి: గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా క్లాప్ మిత్రలు సేకరించాలని డీపీఓ రవికుమార్ అన్నారు. మండలంలోని రామేశ్వరం, పెద్దాడ గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు తడి, పొడి చెత్తను ఏ విధంగా సేకరిస్తున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి గ్రామాల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని అన్నారు. దీనికి సంబంధించి సచివాలయ కార్యదర్శులు, సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి విధులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ మన్యం శ్రీనివాస్ చౌదరి, సచివాలయ కార్యదర్శులు భోగరాజు ప్రసన్నాంజనేయులు, ఎస్.కనకనాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పెద్దాడలో చెత్త సేకరణపై ప్రజలకు వివరిస్తున్న డీపీఓ రవికుమార్

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వెంకటగిరి కొండపై నుంచి వివిధ గ్రామాలకు తాగు నీటిని అందించే ప్రాజెక్ట్ పైపులైన్ల లీకేజీలపై 'తాగునీటి పథకంపై నిర్లక్ష్యం' అనే శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద పైపులైన్ లీకేజీకి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. సమస్య తీరడంతో బుధవారం సాయంత్రం నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఆన్‌లైన్ లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలియని ఫోన్ కాల్స్, వాట్సాప్ చాటింగ్, ఈ- మెయిల్ మెసేజ్‌లలో వచ్చిన అపరిచిత లింకులను క్లిక్ చేయరాదన్నారు. అలా చేయడం వల్ల ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్, వ్యక్తిగత వివరాలు అపహరణకు గురయ్యే ప్రమాదముందన్నారు. బాగా పరిచయస్తులు పంపిన లింకులు కూడా నిర్ధారించుకోకుండా ఓపెన్ చేయరాదని, అలాగే బహిరంగంగా వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930కు లేదా, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూర్యనారాయణరెడ్డి సూచించారు.

ప్లాస్టిక్ వాడకంపై జరిమానాలు

ప్రకాశంనగర్: ప్లాస్టిక్ నిషేధానికి బుధవారం నగరపాలక సంస్థ అధికారుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వ్యాపారులకు జరిమానాలు విధించారు. నగరంలోని కంబాలచెరువు, దేవీచౌక్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు ముఖ్య వ్యాపార కూడళ్లలో ఈ దాడులు జరిగాయి. సైకిల్, తోపుడు బండ్ల, కూరగాయల వ్యాపారులు, టిఫిన్, బిర్యానీ వంటి వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇందులో కొందరికి జరిమానాల ఊసెత్తలేదు. ఇష్టానుసారంగా జరిమానాలు విధించడం సరికాదని, ముందు వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్లాస్టిక్ హోల్‌సేల్ వ్యాపారులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం ప్రకటించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలిగే అంతరాయంతో కోర్లంపేట, రామచంద్రరావు పేట, సాంబశివరావు పేట, తుమ్మలోవ, దేవీచౌక్, ఎన్టీఆర్ సెంటర్, కంబాలపేట, జాంపేట ప్రాంతం, అశోక థియేటర్ ప్రాంతం, అన్నపూర్ణమ్మపేట తదితర ప్రాంతాలకు ప్రభావం ఉంటుందన్నారు.

జెడ్పీ హైస్కూల్ పరిశీలన

సీతానగరం: మండలంలో రఘుదేవపురం గ్రామంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను రాష్ట్ర స్థాయి పరిశీలకుడు, సిమాట్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. ఈ హైస్కూల్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌గా ఎంపికైన సందర్భంగా ఆయన పరిశీలనకు వచ్చారు. పాఠశాల్లోని వసతులు, విద్యార్థుల అచీవ్‌మెంట్స్‌ను తనిఖీ చేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్లేగ్రౌండ్, పీఎంశ్రీ నిధులతో అభివృద్ధి చేసిన ఆట స్థలం, ర్యాంపు, ఇంకుడు గుంటలు, కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన ల్యాబ్‌ల ఏర్పాటుకు కావలసిన అదనపు తరగతి గదులకు తలుపులు, కిటికీలు పెట్టించడానికి ఇప్పటికే సర్వశిక్షాభియాన్ ఏపీసీ అనుమతి పొంది ఉన్నాయని హెచ్ఎం ఎం.శ్యామలాదేవి ఆయనకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.స్వామినాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలి

బిక్కవోలు: మండలంలోని నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని రూ.1.06 కోట్లు వసూలు చేయాలన్నారు. ఇప్పటికి రూ.50.88 లక్షలు వసూలు చేశామని, ఇంకా రూ.55.56 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. అత్యధికంగా బిక్కవోలులో రూ.15.82 లక్షలు, పందలపాకలో రూ.9.71 లక్షలు ఊలపల్లిలో రూ.8.32 లక్షలు, కొంకుదురు రూ.5.21 లక్షలు కొమరిపాలెంలో రూ.4.49 లక్షలు వసూలు చేయాలన్నారు. ఈ ఐదు గ్రామాల్లో 80 శాతం వసూలు రావాల్సి ఉందన్నారు. అలాగే రైతులు కూడా వసూలుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకం

- జాతీయ రహదారిపై అడుగడుగునా గోతులు
- తూతూమంత్రంగా మరమ్మతులు
- రోజుల వ్యవధిలోనే మళ్లీ అధ్వానం
- ప్రయాణికులకు తీవ్ర అవస్థలు

రాజానగరం: పేరుకే జాతీయ రహదారి. ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఇదీ 16వ నంబర్ జాతీయ రహదారి దుస్థితి. చేసిన పనుల్లో నాణ్యత లోపంతో పాటు, వర్షాల ప్రభావంతో జాతీయ రహదారిపై అనేక చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. అడుగడుగునా గోతులు పడటంతో.. రయ్ రయ్ మంటూ ప్రయాణించే వాహనాలు ఢబేల్ మంటూ వాటిలో పడుతూ వాహనదారులను వణికిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారిపై తారు, కంకర మిశ్రమాన్ని పొరలుగా పోస్తూ, రహదారికి అధికారులు మెరుగులు దిద్దుతున్నారు. ఈ పనుల్లో నాణ్యత లోపించడంతో.. తాత్కాలిక మెరుగులు వర్షాలకు కొట్టుకుపోయి, కొద్దిరోజుల్లోనే మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి.

జేబులు ఖాళీ

జాతీయ రహదారిపై వేగానికి నియంత్రణ లేకపోవడంతో బైకులు, కార్లు, లారీలు ఇలా ప్రతి వాహనం వేగంగా దూసుకుపోతుంటాయి. వర్షాల కారణంగా రహదారిపై పడిన గోతులను దగ్గరకు వచ్చే వరకు గమనించే అవకాశం లేకపోవడంతో.. ఆయా వాహనాలు వాటిలో పడుతూ పెద్ద శబ్దాన్ని చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వాహనదారుల గుండెలు గుభేల్ మనడమే కాకుండా, ఆయా వాహనాల జంపర్లు, ఇతర పరికరాలు మరమ్మతులకు గురికావడంతో జేబులు ఖాళీ అవుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలకు కూడా దారితీసి, వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు.



దివాన్‌చెరువు జాతీయ రహదారిపై పడిన గోతులు

నాణ్యత లోపమే ప్రధాన కారణం

సాధారణంగా రహదారుల అభివృద్ధి, మరమ్మతు పనులను వేసవిలో చేస్తుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16వ నంబర్ జాతీయ రహదారి రావులపాలెం నుంచి తుని వరకు సుమారు 130 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ రహదారిని పర్యవేక్షిస్తూ, మరమ్మతులు చేసే బాధ్యతను వివిధ కంపెనీలు తీసుకున్నాయి. కాలానుగుణంగా ఆయా కంపెనీలు రహదారి మరమ్మతులతో పాటు, డివైడర్లపై నాటిన మొక్కల పెంపకానికి కూడా బాధ్యత తీసుకోవలసి ఉంటుంది. ఈ పనులు తూతూమంత్రంగా చేపట్టడంతోనే సమస్యలు వస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. టోల్ గేట్ ఫీజుల పేరుతో వాహనదారుల నుంచి భారీగా సొమ్ములు వసూళ్లు చేస్తున్న పాలకులు.. రహదారుల నిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేసవిలో చేపట్టవలసిన మరమ్మతులను వర్షాలు కురిసే సమయంలో తూతూమంత్రంగా చేపట్టడంతో ఆ పనులలో నాణ్యత లోపించి, చేసిన పనులు ఎక్కువ రోజులు మన్నడం లేదని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడటమే కాకుండా, ప్రజాధనం కూడా వృథా అవుతుందని ప్రజలు వాపోతున్నారు.